# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం




**-ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో గురువారం "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాలను ఎస్పీ మహేష్ బి.గితే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ, "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజల సహకారంతో జిల్లాలో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని తెలిపారు. "ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టి నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు . ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి" అని కోరారు."డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడుతున్నామని అన్నారు . యువతను మత్తు పదార్థాల దుష్ప్రభావాల నుంచి రక్షించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. డ్రగ్స్ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు . మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలి" అని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు.పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపవద్దు, రాంగ్ రూట్‌లో ప్రయాణించవద్దని, ఈ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు అని తెలిపారు. అలాగే కోరుట్లపేట గ్రామంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు అవగాహనతో ఉండటాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ రాహుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్ బాధితులను పరామర్శించిన కేటీఆర్, హరీష్ రావు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం కెసిఆర్ నగర్లో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనలో అస్వస్థతకు గురై సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మరియు ఎమ్మెల్యే టి. హరీష్ రావు పరామర్శించారు.ఆసుపత్రికి చేరుకున్న కేటీఆర్, హరీష్ రావు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన కేటీఆర్, చిన్నారులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని అధికారులను, వైద్య సిబ్బందిని ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేటీఆర్, చిన్నారులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# మానాల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పాఠ్యపుస్తకాల పంపిణీ..



**బలగం టీవీ, రుద్రంగి :**

విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్ తో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందచేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బుర్ర శంకర్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్‌కు పునాది ప్రభుత్వ పాఠశాలలేనని, వారి అభివృద్ధికి గ్రామపంచాయతీ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. ఉప సర్పంచ్ దాసరి అశోక్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజాప్రతినిధులు కూడా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి... విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యతను వివరించి, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, వార్డు సభ్యులు లక్కాకుల రమేష్, మాజీ వైస్ ఎంపీపీ లు పిసరి భూమయ్య, బాధనవేని రాజారాం, విడిసి చైర్మన్ అంగరకుల మహేష్,నాయిని రాజేశం, చెదలు నవీన్, లక్కాకుల స్వామి, జక్కు గంగాధర్, తాటికొండ శ్రీనివాస్, బత్తుల వెంకట్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితురాలికి

# అండగా నిలిచిన సామాజికవేత్త తూడి లచ్చన్న

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత గత కొంతకాలంగా క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనగా, బాధిత మహిళ దుస్థితిని తెలుసుకున్న ప్రముఖ సామాజికవేత్త తూడి లచ్చన్న, మానవతా దృక్పథంతో ఆమెకు అండగా నిలిచారు. గురువారం లత నివాసానికి చేరుకున్న , తూడి లచ్చన్న తన వంతు సాయంగా రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా తూడి లచ్చన్న మాట్లాడుతూ.. "పత్రికలు, సామాజిక మాధ్యమాలు మరియు ప్రజా ప్రతినిధుల ద్వారా లత పరిస్థితిని తెలుసుకున్నాను. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం మనందరి బాధ్యత. నిరుపేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా నావంతు సేవలను కొనసాగిస్తున్నాని అన్నారు . సమాజంలో ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని" పిలుపునిచ్చారు. అనంతరం లత కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య-మహేష్, ఉపసర్పంచ్ కల్లేపల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొని లచ్చన్న చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.





## తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి

**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు ఐలు భిక్షపతి గౌడ్ (55) తాటి చెట్టు పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఈ విషాద ఘటన గురువారం సాయంత్రం భీమరపల్లి గ్రామ పరిధిలో చోటుచేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, గీత వృత్తిలో భాగంగా భిక్షపతి గౌడ్ తాటి చెట్టు ఎక్కి పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలంలోనే ఆయన మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి భార్య సరోజనతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన భిక్షపతి గౌడ్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో కూడా విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

### సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షల ప్రారంభం

**బలగం టీవీ, వేములవాడ**

పురపాలక సంఘంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి నెలకు రూ. 26 వేల వేతనం చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా గురువారం వేములవాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా గుర్రం అశోక్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి మున్సిపల్ కార్మికుడికి రూ. 26 వేల వేతనం అమలు చేయాలని కోరారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికులను గౌరవప్రదంగా పదవీ విరమణ చేయించి, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ రిలే నిరాహార దీక్షలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మోసం రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సరిపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి దుబ్బుల లచ్చయ్య, ఉపాధ్యక్షులు సుంకపాక పరుశరాములు, సావనపల్లి శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్, ఎండీ అజ్జు, కార్మికులు గాజుల వజ్రమ్మ, వావిలాల లక్ష్మి, పుప్పాల మమత, వావిలాల రాధా తదితరులు పాల్గొన్నారు.




## బాలికపై లైంగిక వేధింపులు..

## నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష..

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

మైనర్ బాలిక లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు 2,000 రూపాయల జరిమానా విధిస్తూ ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ మహేష్ బి. గితే ఓ ప్రకటన లో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ గంభీరావుపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడగా, బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంభీరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారని అన్నారు.అప్పటి ఎస్ఐ మహేష్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని రిమాండ్‌కు తరలించి, తదనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారని అన్నారు.

కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పకడ్బందీగా వ్యవహరించారగా,ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్ గట్టిగా వాదించగా, కోర్టులో ఎనిమిది మంది సాక్షులను ప్రవేశపెట్టాగా,శాస్త్రీయ ఆధారాలను, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో నిందితుడికి ఈ శిక్షను ఖరారు చేశారని అన్నారు . సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని, కఠిన శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ విభాగాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. వ్యూహాత్మకంగా న్యాయ విచారణను నిర్వహించి, నేరస్థులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్, అప్పటి ఎస్ఐ మహేష్, ప్రస్తుత ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్స్ శంకర్, శ్రీనివాస్, నవీన్ మరియు వెన్నెలలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## చిక్కాల అశ్విన్ రావు కి నివాళులర్పించిన కేటీఆర్, హరీష్ రావు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కుమారుడు, కీర్తిశేషులు చిక్కాల అశ్విన్ రావు దశదినకర్మ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు, మరియు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు గారు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మరియు హరీష్ రావు గారు అశ్విన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అశ్విన్ రావు అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, చిక్కాల రామారావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇక్కడ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




## పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత..

**బలగం టీవీ, గంభీరావుపేట:**

జిల్లాలో మహిళల భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ బృందాలు పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా గురువారం గంబిరావుపేట మండలంలోని ముచ్చెర్ల, లింగన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులలో పాల్గొంటున్న మహిళా కూలీలకు భద్రతా ప్రమాణాలు, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా షీ టీమ్ అధికారులు మాట్లాడుతూ, మహిళలు ఎటువంటి వేధింపులకు గురైనా భయాందోళనలకు లోనుకాకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు వెంటనే జిల్లా షీ టీమ్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 56425కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, బాధితుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.?పని ప్రదేశాల్లోనే కాకుండా, సోషల్ మీడియా వినియోగంలో కూడా మహిళలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులతో అనవసరమైన సంభాషణలకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు లేదా ఫోన్ నంబర్లను గుర్తు తెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీనివాస్, ప్రియాంక, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు.

### మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు.

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని ఎస్సై రాహుల్ రెడ్డి పేర్కొన్నారు.

